పార్టీ ప్రచారాన్ని విస్తృతం చేయండి


పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

• జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

రాజాం: గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలంతా పార్టీ ప్రచారాన్ని విస్తృతం చేయాలని, ఈ ఐదేళ్లలో మన ప్రభుత్వం చేసిన మేలును ప్రతీ ఇంటికి వెళ్లి, వివరించాలని జెడ్పీ చైర్మన్, పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల డిప్యూటీ రీజనల్ కో–ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్‌తో కలిసి నియోజకవర్గ స్థాయి నాయకులతో మంగళవారం సమావేశమైన ఆయన రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్షాల నేతలు గ్రామాల్లో తప్పుడు ప్రచారం చేస్తూ, దొడ్డిదారిన ఓటర్లను తప్పుదోవ పట్టించే కార్యక్రమం చేస్తారని, ప్రతీ కార్యకర్త అప్రమత్తంగా ఉండి, వాటిని తిప్పికొట్టాలన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులతో పాటు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. రాజాం నియోజకవర్గంలో గెలుపు ఖాయమనే ధీమాను పక్కనబెట్టి, అత్యధిక మెజార్టీ కోసం కృషి చేయాలన్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు చాలా గడువు ఉందని, ఈలోగా మన మెజార్టీని పెంచుకునే కార్యక్రమాలు చేయాలన్నారు. గడువు ఉందని, జాప్యం చేయొద్దని, ప్రతీ బూత్ కన్వీనర్, గృహసారథి తమ పరిధిలోని కుటుంబాలతో ప్రతిరోజూ మాట్లాడాలని, జగనన్న చేసిన మంచిని వివరించాలన్నారు. ఈ రెండు నెలలు కష్టపడితే అత్యధిక మెజార్టీని ఇక్కడ నుంచి ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. రాజాం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఖరారైన డాక్టర్ తలే రాజేష్‌ని ప్రతీ ఇంటికి పరిచయం చేయాలని, ఫ్యాన్ గుర్తుపై ప్రతీ ఒక్కరి ఓటు పడేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, పార్టీ రాజాం నియోజకవర్గ పరిశీలకులు కె.వి.సూర్యనారాయణరాజు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, పార్టీ నాలుగు మండలాల అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, కరణం సుదర్శనరావు, వావిలపల్లి జగన్‌మోహనరావు, గురుగుబెల్లి స్వామినాయుడు, వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, నక్క వర్షిణి, టంకాల అచ్చెన్నాయుడులు తదితరులు పాల్గొన్నారు.

బీసీల నియోజకవర్గంలో పోటీకి రాజులు భయపడాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

• విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: బీసీలు ఎక్కువగా ఉన్న బొబ్బిలి నియోజకవర్గంలో పోటీ చేసేందుకు రాజులు భయపడే పరిస్థితి రావాలని, ఆ స్థాయిలో ఈసారి వారిని ఓడించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మంగళవారం మాట్లాడిన ఆయన బీసీలంతా ఐక్యంగా ఉండాలని కోరారు. బీసీల ఐక్యత చాటాల్సిన సమయం వచ్చిందన్నారు. నియోజకవర్గంలో 90 శాతానికి పైగా ఉన్న బీసీలంతా కలిసి బీసీ అభ్యర్థిని అయిన తనను గెలిపించాలని, కనీసం పది శాతం కూడా లేని రాజులను ఓడించాలని బీసీ సంఘాలు కొద్దిరోజుల క్రితం చేసిన ప్రచారానికి ధన్యవాదాలు అన్నారు. ఇటీవల బొబ్బిలి రాజులు నిర్వహించిన టీడీపీ సమావేశంలో రాజుల పక్కన కూర్చొన్న బీసీ అయిన మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు మాట్లాడుతూ బీసీ అయిన తనకు టీడీపీ 2009లో టిక్కెట్ ఇస్తే శంబంగి మోసం చేశారనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆ రోజుల్లో సీనియర్ అయిన తనను కాదని, పొమ్మనకుండా పొగబెట్టే ఉద్దేశ్యంతోనే జూనియర్ అయిన లక్ష్మంనాయుడుకు టికెట్ ఇచ్చిన చంద్రబాబుకు తన అభిమానులు బుద్ధి చెప్పాలనే వేరే వ్యక్తికి ఓటేసిన విషయం ఫలితాల తర్వాత తనకు తెలిసిందన్నారు. పోలింగ్ రోజున వారి చిన్నాన్న, బంధువులు పక్కి గ్రామంలోనే ఉన్నారు కదా అని గుర్తుచేశారు. ఆరోజు ఆయన(తెంటు లక్ష్మంనాయుడు)ను ఓడించారని తనపై అక్కసు వెళ్లగక్కుతున్న తెంటు లక్ష్మంనాయుడు రాజులను(అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి సుజయ్ కృష్ణరంగారావు) ఎందుకు ఓడించలేదనా ఆయన వ్యాఖ్యల అర్థమని ఎమ్మెల్యే ప్రశ్నించారు. పక్కనున్న వారిని నువ్వు సపోర్ట్ చేస్తున్నట్టా.. ఆవేశాన్ని బయటకు వెళ్లగక్కడానికా.. అని నిలదీశారు. లక్ష్మంనాయుడి స్వగ్రామాన్ని(ముగడ) మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు దత్తత తీసుకున్నా అక్కడ ఏమాత్రం అభివృద్ధి జరుగలేదని, జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయ్యాకే ఆ గ్రామం బాగుపడిందన్న విషయం తెలుసుకోవాలన్నారు. అభ్యర్థుల కన్నా నీవెందుకు అంత బాధపడిపోతున్నావో అర్థం కావడం లేదన్నారు. అప్పట్లో కాంగ్రెస్, టీడీపీ అవగాహన ఒప్పందంతోనే నీకు 8 నెలల ఎమ్మెల్యే పదవి వచ్చిందన్న విషయం గుర్తుచేశారు. మాజీ మంత్రి సుజయ కృష్ణరంగారావు మేము సమిష్టిగా ఉన్నామని చెప్పుకున్నారని, రాజుల అన్నదమ్ముల్లో ఒకరి కోసం మరొకరు పనిచేసుకోరని వారి పార్టీ(టీడీపీ) నాయకులు, కార్యకర్తలే చెప్పుకుంటున్నారని అంతేగానీ తాము ఎప్పుడూ రాజుల మధ్య గొడవలు పెట్టేందుకు చూడలేదన్నారు. వారిద్దరూ ఎప్పుడూ కలిసిమెలసి ఉండడమే తమకు కావాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు చోడిగంజి రమేష్‌నాయుడు, ఉత్తరావెల్లి అప్పలనాయుడు, తెర్లాం మండల పార్టీ అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదరరావు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

రూ.5.31 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం


వాసవీనగర్‌లో కొత్తగా నిర్మించి సీసీ రోడ్డు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని వాసవీనగర్‌లో రూ.5.31 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మించారు. అన్ని వార్డుల్లో పెండింగ్‌లోని సీసీ రోడ్డు, మురుగుకాలువల నిర్మాణాలు పూర్తి చేసినట్లు ఏఈ పి.వెంకట్ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెర్లాం మండలంలోని జె.కొత్తవలస గ్రామానికి చెందిన జాడ చిన్నప్పడుకు మంజూరైన రూ.60 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతులమీదుగా మంగళవారం అందజేశారు. ఆపదలో ఉన్న వారిని సీఎం జగన్మోహన్‌రెడ్డి మంచి మనసుతో ఆదుకుంటున్నారని, వైద్యసేవల కోసం అందజేసిన ఈ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, సర్పంచ్ రాయివల్లి రామ్మూర్తి, పార్టీ తెర్లాం మండల తెంటు సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్


కవాతు ప్రదర్శనలో పోలీసులు


తెర్లాం: మండలంలోని రాజయ్యపేట, తెర్లాం గ్రామాల్లో పోలీసులు మంగళవారం ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు ఈ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెర్లాం ఎస్‌ఐ ఆర్.రమేష్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి గొడవలు జరగకుండా ప్రజలంతా శాంతియుతంగా ఉండేలా అతి సమస్యాత్మక, సమస్యాత్మక గ్రామాల్లో విడతల వారీగా కవాతు ప్రదర్శన(ఫ్లాగ్‌మార్చ్) చేపడుతున్నామన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


ఆనవరంలో పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న ఏఆర్‌వో రాజారావు

బాడంగి: మండలంలోని ఆనవరం, పినపెంకి, గూడెపువలస, రావివలస, పూడివలస గ్రామాల పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఏఆర్‌వో, తహసీల్దార్ రాజారావు మంగళవారం పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు అవసరమైన వసతులు ఉన్నవీ లేనివీ గమనించారు. అనంతరం రేజేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో జరిగే పదో తరగతి పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించారు.

ఆయుర్వేద వైద్య శిబిరం


వృద్ధురాలి బీపీ పరిశీలిస్తున్న ఆయుర్వేద వైద్యాధికారి సునీల్‌కుమార్

రేగిడి: మండలంలోని ఖండ్యాం గ్రామంలో ఆయుర్వేద వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన రోగులకు ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఆయుర్వేదం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామశేషు, ఏఎన్ఎం స్వాతి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం, ఖండ్యాం, వెంకటాపురం గ్రామాల్లో మంగళవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఆయా గ్రామాల సర్పంచ్‌ల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో వీధులు, కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించి, బ్లీచింగ్ చల్లారు. గ్రామాల పరిశుభ్రతతోనే గ్రామీణుల ఆరోగ్యమని, అందుకే పారిశుద్ధ్య పనులు నిరంతరం జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో శ్యామలాకుమారి తెలిపారు.

ఘనంగా చిన్నమ్మతల్లి జాతర


రామభద్రపురం: అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు


రామభద్రపురం: చదురుగుడిలో అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి దంపతులు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

రామభద్రపురం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా, చింతలు తీర్చే చిన్నమ్మగా జిల్లాలో ప్రసిద్ధి గాంచిన చిన్నమ్మతల్లి దర్శనానికి భక్తులు బారులుతీరారు. మంగళవారం వేకువజామున 2 గంటల నుంచే మండల కేంద్రంలోని అమ్మవారి గద్దెకు భక్తులు పోటెత్తారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి తొలేళ్ల ఉత్సవం, మంగళవారం అమ్మవారి ఘటాల తిరువీధి ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో తల్లి దర్శనానికి భక్తులు వేలాదిగా వచ్చి, చల్లంగ చూడు తల్లీ అంటూ పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, బొబ్బిలి ఎంపీపీ లక్ష్మీవేణుగోపాలనాయుడు, సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, వైస్ సర్పంచ్ చింతల రామకృష్ణ కూడా అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అందరూ అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లేలా దీవించమని వేడుకున్నారు. క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులకు మంచినీరు, మజ్జిగ, ప్రసాదం పంపిణీ చేశారు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చదురుగుడిలోని అమ్మవారిని భక్తులు దర్శించుకునేందుకు ఇబ్బందులు పడకుండా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ తిరుమలప్రసాద్, ఎస్‌ఐ జ్ఞానప్రసాద్, పోలీస్ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

బాడంగిలో పోలమ్మతల్లి సంబరాలు

బాడంగి: మండల కేంద్రంలో పోలమ్మతల్లి సంబరాలు మంగళవారం ఆరంభమయ్యాయి. వారం రోజుల పాటు జరిగే వేడుకల్లో అమ్మవారి జంగిడి, ఘటాల తిరువీధి తర్వాత వచ్చే సోమవారం నుంచి మూడు రోజుల పాటు పండగ జరుపుకోనున్నారు. మంగళవారం అమ్మవారి గద్దెలో పోలమ్మతల్లి ఘటంతో పాటు పరదేశమ్మ ఘటాల తిరువీధి నిర్వహించారు.

ఆధ్యాత్మికతతోనే గ్రామాల్లో ప్రశాంతత


రామభద్రపురం: ఆంజనేయస్వామి రథం లాగుతున్న ఎమ్మెల్యే శంబంగి

• ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు


తెర్లాం: పూజల్లో పాల్గొన్న భక్తులు

రామభద్రపురం: ఆధ్యాత్మికతతోనే గ్రామీణ ప్రాంతాల్లో ప్రశాంతత నెలకొంటుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని కొట్టక్కి గ్రామానికి చెందిన సింగారపు భీమ తన సొంత నిధులతో ఆ గ్రామంలో నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. గడిచిన మూడు రోజులుగా కల్యాణాలు, రుద్రాభిషేకాలు, హోమం వంటి పూజలు చేశారు. ఈ నేపథ్యంలో స్వామి వారిని ఎమ్మెల్యే మంగళవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన తిరువీధిలో స్వామి వారి రథం లాగారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, ఎంపీటీసీ సామిరెడ్డి రమణమ్మ, వైఎస్సార్ సీపీ సీనియర్ నేతలు ముల్లు సాగరసాయి, సామిరెడ్డి చంద్రరావు, మండల యూత్ అధ్యక్షుడు పత్తిగుళ్ల ఏక్‌నాథ్, పార్టీ మండల పార్టీ ఉపాధ్యక్షుడు దర్రు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని నందిగాం గ్రామంలో రామాలయ ప్రారంభోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరుగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద సామూహిక పూజా కార్యక్రమాలు చేపట్టారు.

క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యం


రామభద్రపురం: ర్యాలీలో ఎంపీడీవో ఈశ్వరమ్మ, వైద్య సిబ్బంది

రామభద్రపురం: క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యమని ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ అన్నారు. మండలంలోని దుప్పలపూడి గ్రామంలో ఈవోపీఆర్‌డీ వెంకటరమణ, వైద్య సిబ్బందితో కలిసి మంగళవారం ర్యాలీ చేపట్టి, క్షయవ్యాధి లక్షణాలు, వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వ్యాధికి సంబంధించిన మందులను ఉచితంగా అందజేయడం జరుగుతోందన్నారు. వైద్యులచే వ్యాధి నిర్ధారణ జరిగిన తర్వాత మొదటి నెల వైద్యుడి వద్ద, రెండో నెల నుంచి ఏఎన్ఎం ద్వారా ఇంటి వద్దనే మందులు తీసుకోవచ్చన్నారు. వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రత్నదీపక్, ఈవో మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: క్షయవ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారులు రెడ్డి శ్రీనివాసరావు, దివ్యభారతి కోరారు. క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని కూనాయవలస గ్రామంలో వ్యాధి నిర్మూలనపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కువగా దగ్గు, కఫం వస్తే వెంటనే పీహెచ్‌సీకి వెళ్లి, తనిఖీలు చేసుకోవాలన్నారు. క్షయ వ్యాధి సోకిన వారు భయపడాల్సిన పనిలేదని, మందులు సక్రమంగా వేసుకుంటే వ్యాధిని నయం చేసుకోవచ్చన్నారు. వ్యాధిగ్రస్తులు ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాడంగి టీబీ కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ రమేష్, సీహెచ్‌వో భాస్కరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష

తెర్లాం: మండలంలోని కూనాయవలస గ్రామంలోని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి హాజరైన రోగులకు తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ దివ్యభారతిలు ఆరోగ్య తనిఖీలు చేసి, రోగులకు అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ భాస్కరరావు, ఫార్మసిస్ట్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: జగనన్న ఆరోగ్య సురక్ష పేదల ఆరోగ్యానికి రక్ష అని ఎంపీడీవో ఈశ్వరమ్మ అన్నారు. మండలంలోని దుప్పలపూడి గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన రోగులకు ఆరికతోట పీహెచ్‌సీ వైద్యాధికారులు బి.రత్నదీపక్, అపర్ణలు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఈవో మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంతకవిటి: మండలంలోని వాసుదేవపట్నంలో ఉన్న కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)లో ఆరో తరగతి, ఇంటర్మీడియట్ సీఈసీలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌వో అలుగోలు ప్రభ ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియట్ సీఈసీలో 40 సీట్లు భర్తీ చేయనున్నామని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు నమోదుకు ఆఖరి గడువు ఏప్రిల్ 24వ తేదీ అని అన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రేగిడి: యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని యోగా గురువు టి.టి.వి.రమణమూర్తి అన్నారు. మండలంలోని మునకలవలస గ్రామంలో జీసీఎస్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–2 ఆధ్వర్యంలో యోగా శిక్షణా తరగతులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతిఒక్కరూ తమ దినచర్యలో యోగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.పురుషోత్తమరావు, ప్రధానోపాధ్యాయుడు తాతన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

రాజాం/రేగిడి/బాడంగి: మండల కేంద్రాల్లోని పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది ఏర్పాట్లు చేయగా, మాస్ కాపీయింగ్ జరగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా, పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా 144 సెక్షన్ అమలుచేశారు.

పకడ్బందీగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు

బాడంగి: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని ఎంసీసీ(మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) ప్రతినిధి, ఎంపీడీవో ఆంజనేయులు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలతో మంగళవారం ఫోన్‌లో మాట్లాడిన ఆయన మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలుపై సూచనలు, సలహాలు చేశారు. ఎక్కడా రాజకీయ పార్టీల ప్రచార చిత్రాలు, పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగ్‌లు ఉండకుండా చూడాలని, ఎక్కడైనా పొరపాటున ఉండిపోతే వెంటనే వాటిని తొలగించాలన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం

జామి: మండలంలో జాగరం గ్రామంలో ఆంజనేయస్వామి తీర్థమహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. భక్తులు వేకువజాము నుంచి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

• సాఫీగా సాగిపోయేలా..


కొత్తవలస-విజయనగరం రోడ్డు

కొత్తవలస: మండల కేంద్రంలో కొత్తవలస–విజయనగరం రోడ్డు మరమ్మతులను అధికారులు యుద్ధప్రాతిపదికను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రత్యేక చొరవతో ప్రభుత్వం రహదారి మరమ్మతులకు రూ.4.01 కోట్లు మంజూరు చేయడంతో యుద్ధప్రాతిపధికన పనులు చేపట్టారు. కంటకాపల్లి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు సుమారు 8 కిలోమీటర్లు మేర రహదారిని పునర్నిర్మించారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణం సాఫీగా సాగుతుండటంతో వాహనచోదకులు, ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని వరలక్ష్మీ జ్యూట్ మిల్లు సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఏఎస్‌ఐ భాస్కరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మున్సిపాలిటీ పరిధిలోని కొండంపేటకు చెందిన లంకలపల్లి వెంకటరమణ తన ద్విచక్ర వాహనంపై తెర్లాం మండలంలోని మాదంబట్లవలస గ్రామానికి వెళ్తున్నాడు. అదే సమయంలో తెర్లాం వైపు నుంచి రాజాం వస్తున్న మరో ద్విచక్ర వాహనదారుడు మిల్లు సమీపంలో ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన వెంకటరమణను 108 అంబులెన్స్‌లో రాజాం కేర్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తండ్రి నాగభూషణరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ తెలిపారు.

పైడితల్లిని దర్శించుకున్న ప్రముఖులు


పైడితల్లికి పూజలు చేస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్, పార్టీ పరిశీలకుడు సూర్యనారాయణరాజు

రాజాం: పట్టణంలో జరుగుతున్న పోలిపల్లి పైడితల్లి జాతరలో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్, పార్టీ పరిశీలకులు కె.వి.సూర్యనారాయణరాజు తదితర ప్రముఖులు మంగళవారం పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. దేవదాయశాఖ ఈవో బి.వి. మాధవరావుతో పాటు కమిటీ సభ్యులు సలాది తులసీదాస్, ఆర్నెపల్లి వెంకటనాయుడు, వెంపల లక్ష్మణరావులు వారికి ఘనస్వాగతం పలికారు. పూజల అనంతరం ఆలయ ఆవరణలో వారిని ఘనంగా సత్కరించారు. జాతరను పరిశీలించిన ఎంపీ.. భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలని, జాతరలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు కట్టుదిట్టం చేయాలని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, వర్షం కారణంగా అపరిశుభ్ర వాతావరణం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడుకు సూచించారు. జాతరను విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు నిర్వాహకులు, అధికారులను అభినందించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, యూత్ అధ్యక్షుడు వంజరాపు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీఓ ఆరుద్ర

చీపురుపల్లి రూరల్(గరివిడి): ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఎస్.ఆరుద్ర అన్నారు. బొండపల్లి ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని కాపుశంబాం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు. సమతుల ఆహారంతో పాటు వ్యాయామం చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జ్యోతి, రాధిక, శకుంతల, అరుణ, కార్యకర్తలు కృష్ణవేణి, అన్నపూర్ణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.